క్లుప్తంగా

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సమీక్ష

పాలకోడేరు: సమాజంలోని బహుముఖ రంగాలలో పేదరికాన్ని రూపు మాపడానికి, సుస్థిర అభివృద్ధి సాధించేందుకు, ప్రభుత్వాలు కొన్ని లక్ష్యాలు రూపొందించడం జరిగిందని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. శనివారం ఆమె వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మురళి గంగాధర్ రావు పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ

సాక్షి, భీమవరం: ఏలూరు నగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 15,16 తేదీల్లో నిర్వహించిన జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో భీమవరం వెస్ట్‌బెర్రీ స్కూల్ విద్యార్థులు పలు పతకాలు సాధించారని స్కూల్ డైరెక్టర్ నడింపల్లి మహేష్‌కుమార్ శనివారం విలేకరులకు చెప్పారు. ఈ పోటీల్లో యు.అశ్విన్ శ్రీవర్మ ఒక స్వర్ణ, రెండు కాంస్య పతకాలు సాధించగా, వి.జయదీప్‌కాంత్ రజితం, కె.సాకేత్ వర్మ కాంస్యం, జి.దినకర్‌వర్మ కాంస్యం, డి.గౌతమ్‌భార్గవ్ రజితం, డి.అభిరామ్‌శ్రీభార్గవ్ రెండు స్వర్ణ, రజితం, ఎస్.లక్ష్మీ సంయుక్త 3 స్వర్ణ పతకాలు సాధించారని మహేష్‌కుమార్ వివరించారు. పతకాలు సాధించిన విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపల్ సారా స్మిత, కోచ్ సీహెచ్ చిన్ను అభినందించారు.

అవయవ దానంపై అవగాహన

ఆకివీడు: అవయవదానం వ్యక్తికి పునర్జన్మనిచ్చినట్లునని ప్రిన్సిపాల్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవయవ దాన దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహనా కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ నోటో సంస్థ 1994 జూలై 8న అవయవ దాన దినోత్సవంను ఏర్పాటు చేసిందన్నారు. మరణించిన దాతలు, వారి కుటుంబ సభ్యులు సమాజానికి చేసిన సేవలను స్మరించుకోవడానికి అవయవ దానం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫ్లోరెన్స్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన

సాక్షి, భీమవరం: మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం మునిసిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసి ఆధ్వర్యంలో భీమవరం మునిసిపల్ కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయుసీ నాయకులు చెల్లబోయిన రంగారావు, కిల్లారి మల్లేశ్వరావు మాట్లాడుతు పెండింగులో ఉన్న జీతాలను విడుదల చేసి మునిస్పల్ ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో మునిస్పల్ వర్కర్స్ నాయకులు బి.సత్యనారాయణ, నీలపు శ్రీను, యేహోస్, ఎల్ రాము తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

భీమవరం అర్బన్: ఈ క్రాప్ నమోదు చేయించుకున్న రైతులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ వేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ సూచించారు. భీమవరంలోని వ్యవసాయ కార్యాలయంలో శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఈ-క్రాప్ నమోదు 100 శాతం పూర్తి చేశామన్నారు. ఈ-కేవైసీ 70 శాతం పూర్తి చేశామని మిగిలిన 30 శాతం రైతులు గ్రామాలల్లో వీపీఏలను సంప్రదించాలన్నారు. ఎరువులు డీసీఎంఎస్‌లో అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సేవా కార్యక్రమాల వేదిక లయన్స్

ఆకివీడు: పేదలకు సహాయం చేసే దాతలకు వేదికగా లయన్స్‌క్లబ్ ఉందని, క్లబ్ ద్వారా దాతృత్వం కలిగిన వారు వారి సహాయాన్ని అందజేయవచ్చునని నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు చెప్పారు. స్థానిక షాదీఖాన మండపంలో శనివారం అభయ క్లబ్ ఆధ్వర్యంలో ఎల్ఐసీ ఏఏఓ ఎం. శారద తన భర్త భీమ్‌రామ్‌జీ జ్ఞాపకార్థం 100 మందికి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్, క్లబ్ అధ్యక్షుడు ఎండీ జక్కి, లయన్స్ ప్రతినిధులు కందుల అప్పారావు, పేర్ని సుబ్రహ్మణ్యం, చిదంబరం, ఊడిగ శ్రీనివాసరావు, తోట భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ఉండి: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహనిర్మాణశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ పీ ప్రశాంతి ఆదేశించారు. శనివారం ఉండి మండలం కలిసిపూడి జగనన్న లేఅవుట్‌లో గృహప్రవేశాలు జరిగిన ఇండ్లను ఆమె పరిశీలించారు. గ్రామంలో 24 ఇళ్లు మంజూరు కాగా 13 గృహనిర్మాణాలు పూర్తయ్యాయని, 11 నిర్మాణంలో ఉన్నట్లు ఈ సందర్భంగా గృహ నిర్మాణశాఖ పీడీ కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా నిర్మాణం పూర్తయ్యి నివాసం ఉంటున్న లబ్ధిదారులతో ఆమె మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు, ఇతర సమస్యలు ఏవైనా ఉన్నాయా? అంటూ ఆమె ప్రశ్నించి తెలుసుకున్నారు. అన్నీ బాగున్నాయని అంతర్గత రోడ్లు కావాలని లబ్ధిదారులు కోరగా వెంటనే అంచనాలు సిద్ధం చేసి మండల పరిషత్ నిధులతో నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తుందని అన్నారు. లబ్ధిదారులను చైతన్యపరచి ఇళ్ల నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలని అన్నారు. బిల్లులు ఎప్పటికప్పుడు జమ అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండి ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.


కలిసిపూడిలో జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

అన్ని వసతులతో పోలింగ్ కేంద్రాలు:

ఉండి కాపులపేటలోని 67,69 పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో గదులు, విద్యుత్, డోర్‌లు, కిటికీలు, మురుగుదొడ్లు,ర్యాంపులు, పరిసరాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు కిలోమీటర్ల పరిధిలోపుగా పోలింగ్ స్టేషన్ కచ్చితంగా ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లో పూర్తి మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ముఖ్యంగా దివ్యాంగులు సులభంగా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేలా ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఓటర్ల జాబితా ప్రకాశం 1500 మందికి లోపుగా ఓటర్లు ఉంటే ఒక పోలింగ్ కేంద్రం దాటితే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసేలా తప్పనిసరిగా ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ పీడీ డాక్టర్ ఆర్‌సీ ఆనందకుమార్,ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ ఎస్వీఎస్ నాయుడు, ఎంపీడీవో ఏవీ అప్పారావు, డీఈఈ శివరామరాజు, ఏఈఈ డీ రామకృష్ణంరాజు తదితర అధికారులు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర శిక్షణ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

సాక్షి, భీమవరం: సమగ్ర శిక్షణ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని 25న విజయవాడలో నిర్వహించే ధర్నాలో జిల్లాలో ఉద్యోగులందరూ పాల్గొనాలని సమగ్ర శిక్షణ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొక్కా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం భీమవరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమగ్ర శిక్షణ కాంట్రాక్ట్ పార్ట్ టైం ఉద్యోగులు జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సమగ్ర శిక్షణ కాంట్రాక్టు ఉద్యోగులు విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, టైం స్కేల్ వేతనాలు ఇవ్వాలని, అన్ని విభాగాల్లోని కాంటాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు పి.సుబ్బారావు, ఆనంద్, ఎం.బాలరాజు, రవి ప్రసాద్, పి.వినయ్, టి.చినబాబు తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో 'స్వచ్ఛతా హీ సేవ'

భీమవరం (ప్రకాశంచౌక్): స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల ఆదేశాల మేరకు డీఎన్నార్ కళాశాల విద్యార్థులు, మునిసిపల్ సచివాలయ సిబ్బందితో శనివారం కలిసి రోడ్ల శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కెప్టెన్ వీరయ్య, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్, లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ధ్యానశిక్షణ

వీరవాసరం: స్థానిక తోటవీధిలోని రామాలయం నందు వీరవాసరం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ధ్యానశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మట్టగుంటకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ టి.బ్రహ్మం పాల్గొని జ్ఞాన బోధ చేశారు. కార్యక్రమంలోజిల్లా కో-ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్, సన్నిధి ఉదయ్, ఎం.కృష్ణారావు, నాగరాజు, వర్రె కృష్ణవేణి, బి.దేవి తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిరోధక చట్టంపై అవగాహన

పాలకోడేరు: మండలంలోని పెన్నాడలోని భీమవరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నందు భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ, బైట్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యాసంస్థలలో ర్యాగింగ్ నిరోధక చట్టం పై సీనియర్ విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భీమవరం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ పవన్ కుమార్ పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు ర్యాగింగ్ గురించి కలిగే దుష్పరిణామాలను వివరించారు. ర్యాగింగ్ చేసిన, చేయడానికి సహాయపడిన వారికి చట్టం ద్వారా పడే శిక్షలను వివరించారు. ఈ కార్యక్రమంలో భీమవరం బార్ అసోసియేషన్ సెక్రటరీ పి రమేష్ బాబు, న్యాయవాదులు ఏ. రాజేష్, ఎస్. సుదీర్, పాలకోడేరు ఎస్సై ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా గణేష్ విగ్రహాల నిమజ్జనం


వెలంపేటలోని గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం


కాళ్లలో ఊరేగింపుగా తరలివెళ్తున్న వినాయకుడు

పలు వీధుల్లో ఊరేగింపులు, శక్తి వేషాలు

ఆకివీడు : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పలు చోట్ల గణేష్ విగ్రహాల ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమం శనివారం జోరందుకొంది. విగ్రహాల ఊరేగింపుతో పురవీధులు, జాతీయ రహదారిలో సందడి ఏర్పడింది. స్థానిక వెలంపేట, మల్లెల వారి వీధి, మాదివాడ, టెలిఫోన్‌ఎక్స్ఛేంజ్ వీధి, తదితర ప్రాంతాల్లోని లంబోదరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూలదండలతో అందంగా ఏర్పాటు చేసిన ట్రాక్టర్లపై స్వామి వారి విగ్రహాల్ని ఏర్పాటు చేసి గరగ నృత్యాలు, డప్పులు, సన్నాయి మేళాలు, శక్తి వేషాలతో అంగరంగ వైభవంగా ఊరేగింపు కొనసాగింది. అనంతరం వెంకయ్య వయ్యేరు కాలువలో విగ్రహాల్ని నిమజ్జనం చేశారు.

ఘనంగా గణపతి నిమజ్జనాలు

కాళ్ల: గణపతి నవరాత్రులు సందర్భంగా వినాయక నిమజ్జనం కార్యక్రమాలు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా కాళ్ల గ్రామంలో ఏనుగు వాహనంపై వినాయకునికి ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో భాగంగా ఏర్పాటు చేసిన హనుమంతుడు వేషధారణ, బుట్టబొమ్మలు అందరినీ ఆకట్టుకున్నాయి. వీటితో ఫోటోలు దిగేందుకు చిన్నారులు ఆసక్తి చూపారు. పెదఅమిరం, జక్కరం, జువ్వలపాలెం, దొడ్డనపూడి, కోమటిగుంట, కోపల్లె తదితర గ్రామాల్లో వినాయక నిమజ్జనాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి విచిత్ర వేషధారణలతో మేళతాళాలు, తీన్మార్ వాయిద్యాల నడుమ యువత వినాయక విగ్రహాల ఊరేగింపులు వైభవంగా నిర్వహించి పంట కాలువల్లో నిమజ్జనం చేశారు.

నేడు ఏఎంసీ నూతన కమిటీ ప్రమాణస్వీకారం

ఉండి: మండలంలోని ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) ప్రమాణ స్వీకరం ఆదివారం నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉండి ఏఎంసీ అభివృద్ధిలో భాగంగా నూతన కమిటీని నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరు నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర చీఫ్‌విప్ నర్సాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్,టీటీడీ బోర్డు సభ్యుడు మేకా శేషుబాబు, జడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ,రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాస రాజు(వాసు) తదితరు పాల్గొంటారని తెలిపారు.


ఉండి ఏఎంసీలో ప్రమాణ స్వీకార ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

కాపులకు ఆర్థిక భరోసా వైఎస్సార్ కాపు నేస్తం

ఆకివీడు: కాపులు ఆర్థికంగా బలపడేందుకు కాపు నేస్తం పథకం ఎంతగానో తోడ్పడుతోంది. కాపులకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా కాపు నేస్తం ఉందని పలువురు కాపు మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సామాజికంగా బలమైన వర్గమైనప్పటికీ ఆర్థికంగా వెనుకబడి ఉన్న కాపు కులస్తులు పేదరికాన్ని, మధ్యతరగతి కుటుంబాలుగా అధిక శాతం ఉండిపోయారు. పాదయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి కాపుల ఆర్థిక స్థితి గతుల్ని తెలుసుకున్నారు. కాపు కుటుంబంలో యజమాని తప్ప మహిళలు పనులకు వెళ్లలేక ఆర్థిక ఇబ్బందులతోనే వంటింటికే పరిమితమైపోయిన విషయాన్ని గుర్తించిన జగన్ సీఎం అయిన వెంటనే కాపు నేస్తం ప్రకటించారు. 45 ఏళ్లు నిండి ప్రతి కాపు మహిళకు రూ. 15 వేలు ఏడాదికి అందజేస్తున్నారు. ప్రతీ ఏటా మహిళల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రభుత్వం అందజేసే ఆర్థిక సహాయం వెన్నుదన్నుగా నిలుస్తోంది. దీంతో వారి ఆర్థిక స్థితి మెరుగుపడుతోంది.

నియోజకవర్గంలో లబ్ధిదారులు: 3,727


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాపు మహిళలు

ఉండి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 45 ఏళ్లు నిండిన కాపు మహిళలు ఈ ఏడాది 3,727 మంది నమోదు అయ్యారు. వారికి రూ. 15 వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని వారి అకౌంట్‌లో జమ చేశారు.

మహిళలపై దాడి

ఉండి: ఇద్దరు మహిళలపై దాడి చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతం గ్రామానికి చెందిన సత్యవతికి, తూర్పుగోదావరి జిల్లా పసర్లపూడి గ్రామానికి చెందిన వళ్లెం మణికంఠతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఒక కుమార్తె ఉంది. మనస్పర్ధల కారణంగా గత నాలుగు నెలల క్రితం అత్తారింటి నుంచి వరుసకు చిన్నమ్మ అయిన ఉండి మండలం మహదేవపట్నం గ్రామానికి చెందిన నక్కా లక్ష్మి ఇంటికి సత్యవతి వచ్చి ఉంటోంది. ఈ నెల 20న సత్యవతి భర్త మణికంఠ, అతని తండ్రి కేదారేశ్వరరావు మహదేవపట్నం వచ్చి సత్యవతి, లక్ష్మిలపై దౌర్జన్యం చేసి, దాడి చేసి గాయపరిచారు. విషయం తెలుసుకున్న లక్ష్మి భర్త వెంకటేశ్వరరావు రావడంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. బాధితురాలు లక్ష్మి పోలీసులను ఆశ్రయించింది.



ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు పాటించాలి

పాలకోడేరు: ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. శనివారం పాలకోడేరు మండలం, పాలకోడేరు గ్రామంలో 51, 53, 57, మోగల్లు గ్రామంలో 46 వ నంబరు పోలింగు కేంద్రాలను జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఓటు హక్కు సులువుగా వినియోగించుకునేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోని వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకొనుటకు ఇబ్బంది లేని విధంగా పోలింగు స్టేషన్ల ఏర్పాటు ఉండాలని ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పి.డి డాక్టర్ ఆర్సీ ఆనంద కుమార్, తహశీల్దారు షేక్ హుస్సేన్, ఎంపీడీవో ఎస్ ఎం గంగాధర రావు, సచివాలయం, రెవెన్యూ, సర్వే సిబ్బంది, తదితరులు ఉన్నారు.


పాలకోడేరులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సంఘ వివాదంపై విచారణ

పాలకోడేరు: కొండేపూడి పంచాయతీ పరిధిలోని రామచంద్రపురంలో అన్ని కుటుంబాలు బీసీ సామాజిక వర్గానికి చెందినవే. ఇటీవల తమ మాటను ధిక్కరించాడనే కారణంతో వీరవల్లి శేఖర్ కుటుంబానికి సహాయ సహకారం అందించేది లేదని స్థానిక సంఘ పెద్దలు ప్రకటించిన వైనం వెలుగులోకి వచ్చింది. అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్న సృజన తన కుటుంబంలో నిర్వహించిన కార్యక్రమానికి శేఖర్ కుటుంబాన్ని పిలవడంపై పెద్దలు కన్నెర్ర చేశారు. పిల్లలు ఎవరినీ సృజన పనిచేసే అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లకుండా కట్టడి చేశారు. దీనిపై స్పందించిన కొండేపూడి అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలు, సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో రామచంద్రపురంలో అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేసినట్లు సీడీపీఓ వాణి విజయరత్నం శనివారం తెలిపారు. వీరవల్లి శేఖర్ తల్లి ధనలక్ష్మి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ఈ వివాదంపై ఫిర్యాదు చేశారు. పెద్దలు అమాయకులని, వారిని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తప్పు దారి పట్టిస్తున్నాడని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భీమవరం రూరల్ సీఐ సీహెచ్ నాగప్రసాద్, ఎస్సై నాళం శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు ఆ గ్రామం వెళ్లి విచారణ చేశారు. రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడంతో ఇరు వర్గాలకు మధ్య రాజీ కుదుర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. శనివారం రాత్రికి కూడా చర్చలు కొనసాగాయి.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ఉండి: పాతకక్షల నేపథ్యంలో ఒకవ్యక్తిపై మరో ఇద్దరు వ్యక్తులు జరిపిన దాడిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం గ్రామ శివారు చెరువుగట్టుపాలెంకు చెందిన కముజు రాజు అనే వ్యక్తి 22వ తేదీ శుక్రవారం రాత్రి ఇంటివద్ద తన భార్యతో గొడవపడుతున్నాడు.అదే ప్రాంతానికి చెందిన దంపరబోయిన సుబ్రహ్మణ్యం, దంపరబోయిన శ్రీదుర్గ అనే వారు పాతకక్షల నేపథ్యంలో ఇదే అదునుగా భావించి ఇనుపరాడ్‌తో రాజు తలపై బలంగా కొట్టారు. గాయాలపాలైన రాజును కుటుంబ సభ్యులు భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు దాడి చేసిన వారిపై ఎస్సై కే గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

